క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి విరాళం

నంద్యాల(వ్యవసాయం): పట్టణ శివారులోని రైతునగరం వద్ద నూతనంగా నిర్మిస్తున్న శ్రీగౌరి కేదార్‌నాథ్ ఆలయానికి బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మధు రూ. 1,00,116ల విరాళాన్ని గురువారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ హిమాలయ ప్రాంతాల్లోని శ్రీగౌరీ కేదార్‌నాథ్ ఆలయ నమూనాతో నంద్యాలలో ఆలయం నిర్మించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేడా మురళీధర్, డాక్టర్ ఇంటి ఆదినారాయణ, పట్టణ అధ్యక్షుడు కొట్టె చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కుల గణన పటిష్టంగా నిర్వహించాలి



17వ వార్డు సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి

నంద్యాల(సిటీ): కుల గణన ప్రక్రియ పటిష్టంగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని పలు వార్డులలో పర్యటించి, వార్డు సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో చేపట్టిన సమగ్ర కుల గణనకు సంబంధించిన విధివిధానాలను, సాంఘిక సంక్షేమ శాఖ విడుదల చేసిన నియమాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. కులగణన ప్రక్రియ మొత్తం వార్డు వలంటీర్లు–సచివాలయ సిబ్బంది ద్వారా జరిగే నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు.

అవగాహనతోనే కుష్టువ్యాధి నియంత్రణ



మాట్లాడుతున్న శారదాబాయి

నంద్యాల(అర్బన్): అవగాహన ద్వారానే కుష్టు వ్యాధిని నియంత్రిచవచ్చని జిల్లా లెప్రసీ అధికారిణి శారదా బాయి తెలిపారు. మదర్‌సా సైటీ స్వచ్ఛంద సంస్థ అధినేత రామారావు ఆధ్వర్యంలో గురువారం వైఎస్‌నగర్ కస్తూరిబా పాఠశాలలో విద్యార్థులకు కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శారదా బాయి మాట్లాడుతూ కుష్టువ్యాధి ప్రాణాంతకమైనది కాదని, వ్యక్తిగత శుభ్రత పాటిస్తూ పౌష్టికాహారం తీసుకుంటే వ్యాధిని నియంత్రించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హెప్సిబా, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ విజయ్‌కుమార్, పీఎంఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీ రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

గోస్పాడు: స్థానిక మోడల్ స్కూల్‌కు చెందిన 11 మంది విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ ఖాజా హుసేన్ తెలిపారు. గురువారం స్థానిక మోడల్ స్కూల్లో విద్యార్థులను ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో అభినందించారు. ఆయన మాట్లాడుతూ 2023–24 విద్యా సంవత్సరానికి 8వ తరగతిలో విద్యను అభ్యసిస్తున్న అవని, వర్షిని, జగదీష్, జెస్సికా రెడ్డి, హర్షిత, సూర్య, లిఖిత, చైతన్య, కల్యాణ్ కుమార్, మౌనిక, నాగమణి ఉపకారవేతనానికి ఎంపికయ్యారని చెప్పారు. వీరందరికీ తొమ్మిదవ తరగతి నుంచి ఇంటర్ రెండవ సంవత్సరం వరకు ప్రతి ఏడాది రూ.12వేల చొప్పున నగదును ప్రభుత్వం అందజేస్తుందన్నారు.

నేడు 'జగనన్న ఆరోగ్య సురక్ష'

ఉయ్యాలవాడ : మండలంలోని ఆర్.జంబులదిన్నె గ్రామ సచివాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రఘురామ్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం నిపుణులైన వైద్యులచే ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాటు చేస్తోందన్నారు. స్థానికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరాటం

నంద్యాల(న్యూటౌన్): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలపై రైతు సంఘం ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో రమేష్‌కుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యతిరేక విధానాల వల్ల రైతులు, కూలీలు, కార్మికులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. కిసాన్ మోర్చ, కేంద్ర కార్మిక సంఘాలు ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈనెల 16వ తేదీన కేంద్ర ప్రభుత్వం విధానాలకు నిరసనగా గ్రామీణ బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాజశేఖర్, రామచంద్రుడు, రామేశ్వర రావు, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

మందలూరు రోడ్డు పనులు మొదలు

- రూ.5.92 కోట్లు మంజూరు
- ఇటీవల భూమిపూజ చేసిన ఎమ్మెల్యే గంగుల
- ముమ్మరంగా సాగుతున్న పనులు
- రహదారి కష్టాలు తప్పాయని గ్రామస్తుల హర్షం





మందలూరు వద్ద రోడ్డుకు ఇరువైపుల ముళ్ల పొదలను తొలగిస్తున్న జేసీబీ

రుద్రవరం: ఆళ్లగడ్డ మండలం పడకండ్ల నుంచి రుద్రవరం మండలంలోని మందలూరు, చందలూరు, మాచినేనిపల్లె మీదుగా బీ.నాగిరెడ్డిపల్లె మెట్ట వరకు ఉన్న రోడ్డు దెబ్బతిని గుంతలమయం మారింది. ఆ దారిన రాకపోకలు సాగించాలంటే ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడే వారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ఆ రోడ్డు దుస్థితిని తెలుసుకున్న ఏపీ జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారులు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు కావడంతో బీటీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. రహదారి నిర్మాణం పూర్తయితే ప్రయాణ కష్టాలు తప్పుతాయని ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోని గత ప్రభుత్వం

రోడ్డు అధ్వానంగా ఉందని ఆ రోడ్డును బాగు చేయించాలని టీడీపీ ప్రభుత్వ హయంలో ఆయా గ్రామాల ప్రజలు అధికారులు, ప్రజాప్రతినిధులను వేడుకున్నా పట్టించుకున్న పాపానపోలేదు. గుంతల్లో కనీసం పిడికెడు మట్టి కూడా వేయించలేకపోయారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఆ రోడ్డు దుస్థితిని తెలుసుకున్న ఏపీ జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారులు గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సమస్యను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సీఎం కొత్త రోడ్డు వేసేందుకు రూ.5.92 కోట్ల నిధులు మంజూరు చేశారు. ఆ నిధులతో అధికారులు టెండర్ ప్రక్రియను పూర్తి చేశారు. ఇటీవల ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డితో రోడ్డు నిర్మాణానికి సంబంధించి భూమిపూజ చేయించి పనులను ప్రారంభించారు. అప్పటి నుంచి పనులు వేగవంతంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగానే మందలూరు వద్ద ఓ జేసీబీతో రోడ్డుకు ఇరువై పులా ఉన్న ముళ్ల పొదలను తొలగించి శుభ్రం చేయిస్తున్నారు. రోడ్డు పనులు సాగుతుండడంతో తమ ఇబ్బందులు తొలగి పోయాయని ఆయా గ్రామల ప్రజలు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

అడ్మిషన్ల పెంపునకు కృషి



విద్యార్థులకు ల్యాబ్ చూపుతున్న అధ్యాపకురాలు

శిరివెళ్ల: యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల పెంపునకు కృషి చేస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణారెడ్డి తెలిపారు. గురువారం కళాశాలలో ఓపెన్ డే జరిగింది. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు చెందిన విద్యార్థులకు కళాశాలలోని బోధన, వసతులు, కంప్యూటర్, జేకే నాలెడ్జి సెంటర్లు, ల్యాబ్‌లను అధ్యాపకులు చూపించారు. కమిషనర్ ఆదేశాల మేరకు డిగ్రీ ప్రథమ సంవత్సరం తరగతులలో అడ్మిషన్ల పెంపునకు ఓపెన్‌డే నిర్వహించామని ప్రిన్సిపాల్ తెలిపారు.

పరిశుభ్రతకు సహకరించాలి



మురుగుకాలువ శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

ఉయ్యాలవాడ : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని గ్రామ సర్పంచ్ మేకల ఓబులేస్ అన్నారు. గురువారం పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా స్థానిక బస్టాండు ఆవరణలో చేపట్టిన పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణం కల్పించడంతో పాటు మౌలిక సదుపాయాలను మెరుగుపరచేందుకు కృషి చేస్తున్నామన్నారు. వ్యర్థ పదార్థాలు, ప్లాస్టిక్ కవర్లు మురుగు కాలువల్లో వేయకుండా గృహ యజమానులు డస్ట్ బిన్‌లలో నిల్వ చేసి, వాటిని హరితరాయబారులు ఇంటి వద్దకు వచ్చిన సమయంలో అందజేయాలని కోరారు.

నులిపురుగుల నిర్మూలనతోనే పిల్లల ఆరోగ్యం

నంద్యాల టౌన్: నులి పురుగులను నిర్మూలనతోనే పిల్లలకు ఆరోగ్యం చేకూరుతుందని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటరమణ అన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నులిపురుగుల వల్ల కలిగే అనారోగ్యాన్ని నివారించడానికి ప్రతి ఏడాది ఫిబ్రవరి 9వ తేదీన జాతీయ నులి పురుగుల దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. 19 ఏళ్ల వయసులోపు వారికి ప్రభుత్వం ఉచితంగా ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తుందని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 2,750 ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో, 1,663 అంగన్‌వా కేంద్రాలలో ఉన్న 4,11,270 మందికి శుక్రవారం మాత్రలు అందజేస్తామన్నారు. పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లకు ఇప్పటికే మాత్రలు తీసుకునే విధానంపై శిక్షణ కూడా ఇచ్చామన్నారు. ఏడాది నుంచి రెండేళ్లలోపు చిన్నారులకు ఆల్బెండజోల్ సగం మాత్ర (200 మిల్లీ గ్రాములు) నీళ్లలో కలిపి తాపించాలని, 2 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలు 400 మిల్లీ గ్రాముల మాత్రను మధ్యాహ్నం భోజనం తరువాత మింగకుండా, చప్పరించేలా చూడాలన్నారు. పాఠశాలల్లో బోధనా సిబ్బంది, వైద్య సిబ్బంది పర్యవేక్షణలో మాత్రలు నమిలి మింగించేలా చూడాలని సూచించారు. విద్యా శాఖ, ఐసీడీఎస్, వైద్య సిబ్బంది అందరూ సమష్టిగా ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

కడుపునొప్పి తాళలేక మహిళ ఆత్మహత్య

దొర్నిపాడు: కడుపునొప్పి తాళలేక ఓ మహిళ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు ధార సువర్ణ(40) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపతోంది. వైద్యం చేయించినా మార్పు రాకపోవడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయ్యంలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి కొడుకు, కూతురు ఉన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

కల్లాపిపొడి మింగి వృద్ధురాలు..

రుద్రవరం: మండల పరిధిలోని ఆలమూరుకు చెందిన లక్ష్మీనరసమ్మ(65) అనే వృద్ధురాలు గురువారం ఇంటి ముందు చల్లే కల్లాపి సౌభాగ్య పొడి మింగి ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు వృద్ధురాలికి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. వారికి వివాహాలు అయ్యాయి. ఆరు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి కాలు విరిగింది. ఇటీవల చెయ్యి కూడా విరిగింది. కుటుంబ సభ్యులు ఆమెకు ఇబ్బంది లేకుండా సేవలు చేస్తున్నారు. అయినప్పటికీ ఆ నొప్పులకు తాళలేక జీవితంపై విరక్తి చెంది ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు ఆమె కుమారుడు వెంకటయ్య ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఘనంగా హోలీక్రాస్ కెథడ్రల్ చర్చి 119వ ప్రతిష్ఠ వేడుకలు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని అతి పురాతనమైన హోలీక్రాస్ కెథడ్రల్ చర్చి 119వ ప్రతిష్ఠ వేడుకలు వైభవంగా జరిగాయి. గురువారం ఉదయం 7గంటలకు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆలయం చుట్టూ క్రైస్తవులు ప్రదక్షిణలు, ప్రత్యేక పాటలతో ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో నంద్యాల డయాసిస్ ఇన్‌చార్జ్ బిషప్ ది.రైట్ రెవరెండ్ వరప్రసాద్ పాల్గొని దైవ సందేశాన్ని అందించారు. క్రైస్తవులు శాంతి, సమాధానం, ప్రేమగుణంతో మెలగాలన్నారు. క్రీస్తు బోధనలను అనుసరించాలన్నారు. అనంతరం బిషప్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో డీనరీ చైర్మన్ జోసెఫ్, చర్చి సెక్రటరీ, ట్రెజరర్ ప్రభుదాసు, స్టీఫెన్‌లతో పాటు ఆయా పాస్టరేట్‌ల గురువులు పాల్గొన్నారు.

ఘనంగా కోత పండుగ..

ప్రతి ఏడాది చర్చి ప్రతిష్ఠ రోజే ఆనవాయితీ ప్రకారం కోత పండుగను ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులందరూ కోత పండుగ కార్యక్రమంలో పాల్గొని దశమ భాగాన్ని దేవునికి చెల్లించారు. దశమ భాగం చెల్లిస్తే క్రైస్తవులకు మెండైన దీవెనలు వస్తాయని బిషప్ వరప్రసాద్ తెలిపారు.

కొనసాగుతున్న సిమెంటు రోడ్ల నిర్మాణాలు



కోటపాడులో వేసిన సిమెంట్ రోడ్డు

శిరివెళ్ల: మండలంలోని గ్రామ పంచాయతీలలో సిమెంట్ రోడ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. గురువారం కోటపాడు గ్రామ పంచాయతీలో రూ. 4 లక్షల పంచాయతీ నిధులతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి సర్పంచు దూదేకుల ఉశేన్‌బీ శ్రీకారం చుట్టారు. ఆమె మాట్లాస్తూ.. ఎన్నో ఏళ్లుగా దేవాలయం, పంచాయతీ కార్యాలయం సమీపంలో రోడ్డు తగ్గులో ఉండటంతో వర్షపు నీరు నిలిచి ఉండేదన్నారు. ప్రజల వినతి మేరకు రోడ్డును వేయిస్తున్నట్లు తెలిపారు. అలాగే రూ. 65 లక్షలతో చేపట్టిన గ్రామ సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలు తుది దశకు చేరుకున్నాయని చెప్పారు. త్వరలో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవాలు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వంకదార సుబ్బసత్యనారాయణ శ్రేష్ఠి, వైఎస్సార్‌సీపీ నాయకులు దూదేకుల గుర్రప్ప, మేర్వ రఘురామిరెడ్డి, తిరుపాలరెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న మున్సిపల్‌కమిషనర్ నిరంజన్‌రెడ్డి

నంద్యాల(సిటీ): సార్వత్రిక ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాలలో బీఎల్‌ఓలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. కొత్తగా ఓటర్ల నమోదు, డబల్. నమోదైన ఓట్ల తొలగింపు, సవరణలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఓటరు లిస్టుల తయారీ ప్రక్రియ సక్రమంగా చేపట్టాలని సూచించారు. సవరణకు సంబంధించి ఫారం–7 రిజక్ట్ చేసినప్పటికీ తప్పనిసరిగా కారణాన్ని పొందుపర్చాలన్నారు. ఓట్ల సవరణలో ఏవైనా సందేహాలు ఉంటే ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, డీటి రమాదేవి, ఏఎస్‌ఓ ప్రహ్లాద తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

- వైద్యుల నిర్లక్ష్యం వల్లేనని బంధువుల వాదన



మృతుని బంధువులతో మాట్లాడుతున్న పోలీసులు

నంద్యాలటౌన్: నంద్యాల పట్టణంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో గుండె ఆపరేషన్ చేయించుకున్న వ్యక్తి మృతి చెందడంతో హాస్పిటల్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పట్టణానికి చెందిన బాల మద్దిలేటి(38) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. గుండె నొప్పిరావడంతో గత నెల 28న ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేరగా మరుసటి రోజు అతనికి గుండెకు సంబంధించిన శస్త్రచికిత్స నిర్వహించారు. ఆపరేషన్ అనంతరం అతను కోలుకోలేక బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుని శరీరం వైద్యానికి స్పందించలేదని, దీంతో ఆరోగ్యం విషమించి మృతి చెందాడని వైద్యులు బంధువులకు తెలియజేశారు. అయితే వైద్యుల నిర్లక్ష్యంతోనే బాలమద్దిలేటి మృతి చెందాడని, తమకు న్యాయం చేయాలని మృతుని తరపు బంధువులు వైద్యులతో వాగ్వాదానికి దిగారు. సమాచారం అందుకున్న ఒకటవ పట్టణ పోలీసులు మృతుని బంధువులకు నచ్చజెప్పి మృత దేహాన్ని అక్కడి నుంచి తరలించారు.

బీజేపీతో పొత్తుపెట్టుకుంటే ముస్లింలు దూరం

నంద్యాల(అర్బన్): బీజేపీ, టీడీపీ, జనసేన పొత్తు పెట్టుకుంటే ముస్లింలు ఆయా పార్టీలకు దూరమయ్యే పరిస్థితులు ఉన్నాయని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి యూనిస్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వనందుకే మోదీ ప్రభుత్వం నుంచి బయటకు వచ్చామని చెబుతున్న చంద్రబాబునాయుడు.. ఎన్నికల కోసం ఇప్పుడు పొత్తు పెట్టుకోవడం దారుణమన్నారు. పచ్చ పార్టీలన్నీ ఒకే గొడుగు కిందకు వస్తే రాష్ట్ర ప్రజలు అంగీకరించే పరిస్థితుల్లో లేరన్నారు. బహిరంగ సభల్లో ప్రజలకు అబద్ధాలు చెబుతూ చంద్రబాబునాయుడు మోసం చేసేందుకు సిద్ధమయ్యారని, ఒంటరిగా పోటీ చేసి గెలవలేక పరాయి పొత్తుల కోసం బాబు వెంపర్లాడుతున్నారన్నారు. మతతత్వ పార్టీ బీజేపీతో పొత్తు ఆ పార్టీ వినాశనానికి దారి తీస్తోందని హెచ్చరించారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): న్యాయమైన ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నంద్యాలలో సీఐటీయూ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, ఉపాధ్యక్షుడు మద్దులు, సహాయ కార్యదర్శి బాలవెంకటలింగం మాట్లాడుతూ ఆశా వర్కర్లకు వేతనాలు పెంచి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో గౌస్, మాధవి, షమీమ్, వరాలమ్మ, మంగమ్మ, సులోచన, సుజాత తదితరులు పాల్గొన్నారు.

యూనాని వైద్యంపై అవగాహన



యూనాని మందులపై అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు

దొర్నిపాడు: స్థానిక పాత పంచాయతీ కార్యాలయ ఆవరణలో యూనాని మందుల ఆవశ్యకతపై గురువారం యూనాని డాక్టర్ షాకీరాబేగం అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ రానున్న వేసవిలో యూనాని మందులు వాడితే వడదెబ్బ, కలరా వంటి రోగాలను దూరం చేసుకోవచ్చన్నారు. అలాగే మోకాళ్ల నొప్పులు ఉన్న వారికి మంచి మందులు ఉన్నాయని తెలిపారు. అనంతరం 39 మందికి వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ రుహుల్లాఖాన్ తదితరులు ఉన్నారు.

పవన్ ఫ్యాన్స్ అత్యుత్సాహం

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని ఏఆర్ మినీ థియేటర్‌లో పవన్‌కల్యాణ్ ఫ్యాన్స్ అత్యుత్సాహం ప్రదర్శించించారు. థియేటర్ సిబ్బంది సమాచారం మేరకు.. బుధవారం ఏఆర్ మినీ థియేటర్‌లో పవన్‌కల్యాణ్ నటించిన కెమెరామెన్ గంగతో రాంబాబు సినిమా రీ రిలీజ్ చేశారు. ఈ క్రమంలో రాత్రి సినిమా చూసేందుకు వచ్చిన పవన్ అభిమానులు గాల్లోకి ఎగిరేసేందుకు తెచ్చిన పేపర్ ముక్కలను స్క్రీన్ ఎదురుగా కుప్పగా పోసి అంటించారు. అప్రమత్తమైన థియేటర్ సిబ్బంది వెంటనే మంటలను అదుపుచేశారు. దీంతో థియేటర్‌లో భారీ అగ్నిప్రమాదం త్రుటిలో తప్పినట్లయింది.

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వ పథకాలు



మాట్లాడుతున్న పీడీ శ్రీధర్‌రెడ్డి

మహానంది: మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక పథకాలు అమలు చేస్తుండటంతో పాటు స్వయం ఉపాధికి శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తోందని డీఆర్‌డీఏ నంద్యాల జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి తెలిపారు. గురువారం బుక్కాపురంలో పొదుపు మహిళా భవనంలో స్రవంతి మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో జూట్ కాటన్ బ్యాగ్‌ల తయారీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ కాటన్ బ్యాగ్‌ల తయారీతో మహిళలకు జీవనోపాధి కలగడంతో పాటు ఆర్థికంగా లాభాలు ఉంటాయన్నారు. మహానంది మండలంలో 90మంది పొదుపు మహిళలకు శిక్షణ ఇచ్చామన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల పరిధిలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి ఆసక్తి కలిగిన వారికి నాబార్డు సహకారంతో యూనిట్లను నెలకొల్పేందుకు అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి, ఎల్‌డీఎం రవీంద్ర కుమార్, డీసీసీబీ డీజీఎం నాగిరెడ్డి పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట గ్రామ సమీపంలోని మోకాళ్ల కురువ అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ రమేష్‌కుమార్ గురువారం తెలిపారు. సుమారు 50 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తి బుధవారం విషపూరిత ద్రావకాన్ని సేవించి ఆత్మహత్యకు పాల్పడినట్లు భావిస్తున్నట్లు చెప్పారు. మృతుడు ఎరుపు రంగు టీషర్ట్, ఆకుపచ్చ ప్యాంటు ధరించాడని తెలిపారు. మృతదేహాన్ని సున్నిపెంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి శవపరీక్షలు నిర్వహించామని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. మృతునికి సంబంధించి వివరాలు తెలిసిన వారు.. టూటౌన్ ఎస్‌ఐ సెల్ 9121101194కు సమాచారం ఇవ్వాలని కోరారు.

మాలధారులకు అన్నదానం



అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

చాగలమర్రి: మండల కేంద్రమైన చాగలమర్రిలోని చెన్నకేశవస్వామి ఆలయంలో శ్రీలక్ష్మీనరసింహ స్వామి మాలధారణ చేసిన సుమారు 65 మంది భక్తులకు శ్రీలక్ష్మీనరసింహస్వామి సేవా కమిటీ అధ్యక్షులు గుత్తి నరసింహులు ఆధ్వర్యంలో గురువారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. జనవరి 16న చాగలమర్రి మండలానికి చెందిన సుమారు 65 మంది భక్తులు మాల ధరించారు. వీరు ఫిబ్రవరి 24వ తేదీ వరకు అంటే 40 రోజుల పాటు దీక్ష కొనసాగించనున్నారు. అనతరం అహోబిలంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వెళ్లి దీక్ష విరమించనున్నారు. కార్యక్రమంలో చెన్నకేశవ స్వామి ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు బోడ్డు వేణుగోపాల్‌రెడ్డి, సభ్యులు రామ సుబ్బయ్య, బోడ్డు పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

ఉయ్యాలవాడ : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పోలింగ్ కేంద్రాలలో వసతులపై ఎలక్ట్రోరల్ అధికారులు దృష్టి సారించాలని తహసీల్దార్ వెంకటరమణ సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గురువారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలో 30 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలలో పోలింగ్‌కు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు ఉన్నాయా లేదా పరిశీలించాలని సూచించారు. జోనల్ రూట్ అధికారులు రాజేంద్రకుమార్, రఫీ, రమణారెడ్డి, ఎంపీడీఓ రఘురామ్, ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు

రుద్రవరం: పోలింగ్ కేంద్రాలన్నింటిలో మౌలిక వసతులు ఉన్నాయని తహసీల్దార్ మురళీమోహన్ తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. మండలంలో మొత్తం 51 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వాటిల్లో ఓట్ల సమయానికి అవసరమైన వసతులు ఉన్నాయా లేవా అన్న అంశంపై ఆరా తీయాలని అధికారులు ఆదేశించారు. ఒక్క వెలగలపల్లె పోలింగ్ కేంద్రంలో బాత్ రూంకు తలుపులు లేవని వెంటనే వాటిని వేయించాలని ఎంఈఓకు సూచించినట్లు తహసీల్దారు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

దొర్నిపాడు: మండంలోని 26 పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ నాగరాజు గురువారం పరిశీలించారు. విద్యుత్, ఫ్యాన్లు, లైటింగ్, మరుగుదొడ్లు వంటి వాటిని పరిశీలించారు. అలాగే దివ్యాంగుల కోసం ర్యాంప్ ఎలా ఉన్నాయనే విషయాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముందుగా ఆయన స్థానిక కార్యాలయంలో ఎంపీడీఓ సుబ్బారెడ్డి, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, మండల వ్యవసాయాధికారి సునీతలతో సమావేశం నిర్వహించి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ఆరాతీశారు.

మహిళా కార్మికుల వేతనాలు పెంచాలి

నంద్యాల(న్యూటౌన్): గోరుముద్ద పథకం మెస్ చార్జీలు, కార్మికుల వేతనాలు పెంచాలని ఏపీ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్‌బాబు, జిల్లా కార్యదర్శి సుంకయ్య కోరారు. గురువారం స్థానిక డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, వినతి పత్రాన్ని డీఈఓ సుధాకర్‌రెడ్డికి అందజేశారు. వారు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకంలో మహిళా కార్మికులు చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నారన్నారు. పేద విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, జగనన్న గోరుముద్ద పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, ఇచ్చే మెస్ చార్జీలను పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు బాలకృష్ణ, విజయలక్ష్మి, అబ్బాస్, శ్రీనివాసులు, ప్రమిలమ్మ, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లపై నిఘా

శిరివెళ్ల: నియోజక వర్గంలోని రౌడీ షీటర్లపై నిఘా పెట్టామని డీఎస్పీ వెంకట్రామయ్య అన్నారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో శాంతి భద్రలతకు ఎలాంటి విఘాతం కలుగకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నియోజకవర్గంలో 406 మంది రౌడీషీటర్లు ఉన్నారని, వారిపై తమ సిబ్బంది నిత్యం నిఘా పెట్టారన్నారు. ప్రతి ఆదివారం వారికి కౌన్సెలింగ్ ఇస్తున్నారని చెప్పారు. అలాగే నియోజక వర్గంలో 34 సమస్యాత్మక గ్రామాలున్నాయని, ఆయా గ్రామాలలో తమ సిబ్బంది పల్లె నిద్ర చేస్తూ.. అంసాంఘిక శక్తులకు కౌన్సెలింగ్ ఇస్తున్నారన్నారు. గత ఎన్నికలలో అహోబిలం, ఆళ్లగడ్డలో మాత్రమే ఘర్షణలు జరిగాయని.. అలాంటివి పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీఐ వంశీధర్, ఎస్‌ఐ సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా మోడల్ స్కూల్ 10వ వార్షికోత్సవం



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న ఎంఈఓ శంకరప్రసాద్

శిరివెళ్ల: మన బడి నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందాయని ఎంఈఓ శంకరప్రసాదు అన్నారు. గురువారం స్థానిక మోడల్ స్కూల్ 10వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా తరగతుల వారీగా పరీక్షలలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు తరగతులు నడుస్తున్నాయన్నారు. అంతకు ముందు ప్రిన్సిపాల్ ఇశ్రత్‌బేగం పాఠశాల పురోగతిని వివరించారు. విద్య, క్రీడలలో పాఠశాల మంచి ఫలితాలను సాధిస్తోందన్నారు. గత 10వ తరగతి పరీక్షలలో 99 శాతం, ఇంటర్మీడియెట్‌లో 92 శాతం ఉత్తీర్ణత సాధించిందని చెప్పారు. ఆడుదాం ఆంధ్ర నియోజక వర్గస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో తమ విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారని తెలిపారు. మన బడి నాడు–నేడు కింద రూ. 44 లక్షలు మంజూరు కాగా మౌలిక వసతులు, ప్రహరీ నిర్మాణం జరిగిందన్నారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్స్ జిల్లా కో– ఆర్డినేటర్ దినేష్‌కుమార్, రుద్రవరం, ఆళ్లగడ్డ మోడల్ స్కూల్స్ ప్రిన్సిపాల్స్ నాగేశ్వరరావు, రాజు, సర్పంచు సాలమ్మ, ఉప సర్పంచు ఇంతియాజ్, టీచర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.